పాఠశాలపై దాడి ఘటనలో రెండు కేసులు

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు ఆరేళ్ల బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన ఘటనలో ఉద్రిక్తతకు కారణమైన వారిపై రెండు కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ సింధూశర్మ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీసు స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. ఈ కేసులో డీఎస్పీ స్థాయి అధికారిణిని విచారణాధికారిగా నియమించామన్నారు. బాలికపై జరిగిన ఘటనకు సంబంధించి ఈనెల 23న వచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిగా భావిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడిని అరెస్టు చేయడంతోపాటు బీఎన్ఎస్, పోక్సో కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కేసులో ఛార్జిషీట్ వేసి ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ జరిపించేలా చూస్తామన్నారు. ఈ ఘటనలో బాధిత బాలికకు ఎలాంటి గాయాలు కాలేదని, కానీ మానసిక పరిస్థితి కొంత బాగా లేదన్న మాట వాస్తవమన్నారు. ప్రజలు ఎలాంటి వదంతులు నమ్మొద్దన్నారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు చేసిన వారిపై రెండు కేసులు నమోదు చేశామని, ఇతరులను రెచ్చగొట్టే విధంగా పోస్టులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళవారం పాఠశాల, పట్టణ పోలీసుస్టేషన్ వద్ద జరిగిన ఘటనల్లో రెండు కేసులు నమోదు చేసి.. నిందితులను గుర్తిస్తున్నామన్నారు. ఈ ఘటనల్లో పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి సహా నలుగురు పోలీసులు తీవ్రంగా గాయపడ్డారన్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన కొందరు దాడులకు పాల్పడ్డారనే ఆరోపణలున్నాయని.. దీనిపై పరిశీలిస్తున్నామని చెప్పారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన వారిని వదిలి పెట్టబోమన్నారు. ఏఎస్పీ నర్సింహారెడ్డి, డీఎస్పీలు తదితరులు పాల్గొన్నారు.


మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ సింధూశర్మ, చిత్రంలో ఏఎస్పీ నర్సింహారెడ్డి, డీఎస్పీలు

మూడు జలాశయాలు.. పట్టాలెక్కించాలి పనులు

ఈనాడు, కామారెడ్డి

జిల్లాలోని బీడు భూములను సస్యశ్యామలం చేసేందుకు తలపెట్టిన కాళేశ్వరం ప్యాకేజీ-22 పనుల స్థితిగతులపై సమగ్ర సమాచారం అందించాలని నీటిపారుదల శాఖ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ విషయమై ఇటీవల నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆ శాఖ ఈఎన్సీ, ప్రత్యేక కార్యదర్శులతో పనులపై సమీక్ష నిర్వహించారు. నూతనంగా ప్రతిపాదించిన మూడు రిజర్వాయర్ల నిర్మాణాలకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలని నిర్దేశించారు. ఈ నేపథ్యంలో ప్యాకేజీ-22 పనుల పూర్తికి చేపట్టాల్సిన ప్రణాళికపై 'ఈనాడు' ప్రత్యేక కథనం.

కాళేశ్వరం ప్యాకేజీ-22 పనుల ప్రగతి వివరాలు

పనుల అంచనా వ్యయం	: రూ. 1446.48 కోట్లు
ఇప్పటివరకు చేసింది	: రూ. 452.34 కోట్లు
సేకరించాల్సిన భూమి	: 4426 ఎకరాలు
సేకరించింది	: 1256 ఎకరాలు

సమస్య పరిష్కరిస్తేనే..

నాలుగేళ్ల అనంతరం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చొరవతో నీటిపారుదల శాఖ మంత్రి కాళేశ్వరం ప్యాకేజీ-22 పనులపై ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంచిప్ప రిజర్వాయర్ సామర్థ్యం పెంపుతో ఏర్పడిన సమస్య పరిష్కరిస్తేనే పనులు ముందుకు కదిలే అవకాశం ఉందని అధికారులు వివరించారు. ఇటీవల ప్రకటించిన బడ్జెట్‌లో రూ.200 కోట్ల మంజూరుకు ప్రతిపాదనలు పంపినప్పటికీ.. రూ.73 కోట్లే కేటాయించారని.. నిధుల విడుదలపై స్పష్టత కొరవడిందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.


అధికారులతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

అనుసంధానంగా మూడు..

మంచిప్ప రిజర్వాయర్ పనులు పూర్తయ్యేలోపు ప్యాకేజీ-22 పనులకు అనుసంధానంగా మూడు రిజర్వాయర్లు నిర్మించేందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించి అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. వీటి నిర్మాణం పూర్తయితే కొత్తగా ఆయకట్టు రావడంతోపాటు ఎల్లారెడ్డి, కామారెడ్డి నియోజకవర్గాల్లో భూగర్భ జలాలు వృద్ధి చెంది నీటి సమస్యలు తీరుతాయి.

ప్రతిపాదిత రిజర్వాయర్ల సామర్థ్యం, అంచనా వ్యయం

రిజర్వాయర్	సామర్థ్యం (టీఎంసీలలో)	అంచనా వ్యయం (రూ.కోట్లలో)
మోతె	1.00	295.75
తిమ్మక్‌పల్లి	1.38	303.01
కాటేవాడీ	0.55	75.34


కాళేశ్వరం ప్యాకేజీ-22 పనుల్లో భాగంగా యాచారం వద్ద తవ్విన సొరంగం

భూ సేకరణ దశలోనే..

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా కామారెడ్డి జిల్లాకు గోదావరి జలాలను తరలించేందుకు 22-ప్యాకేజీ పనులు ప్రారంభించారు. నిధుల విడుదలలో జాప్యం కారణంగా పనులు పూర్తి కావడం లేదు. కాల్వల తవ్వకాలు, ఇతర పనులకు పెద్దఎత్తున భూ సేకరణ చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో ఎగువ మానేరు నుంచి సాగునీటిని ఎత్తిపోసేందుకు ఉద్దేశించిన ప్రాజెక్టును పట్టాలెక్కిస్తేనే గోదావరి జలాల తరలింపు సాధ్యమయ్యే అవకాశాలున్నాయి.

సమగ్ర నివేదిక కోరారు..

ప్యాకేజీ-22 పనులపై ఇటీవల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సమీక్ష జరిగింది. పనుల స్థితిగతులపై సమగ్ర నివేదిక కోరారు. మూడు ప్రతిపాదిత రిజర్వాయర్ల వివరాలు తెలుసుకున్నారు. వారం రోజుల్లో నివేదికను సమర్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.
- శ్రీనివాస్, సీఈ, కామారెడ్డి

స్వైరవిహారం చేస్తూ.. పిక్కలు పట్టేస్తూ..

న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం

- జిల్లా కేంద్రంలో తరచూ కుక్కల దాడి ఘటనలు
- బుధవారం ఆరుగురికి తీవ్ర గాయాలు

కామారెడ్డి జిల్లా కేంద్రంలో బుధవారం 31, 45, 46, 47 వార్డుల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తూ.. కనిపించిన వారిపై దాడికి పాల్పడ్డాయి. సత్తవ్వ అనే మహిళకు తీవ్ర గాయాలు కాగా.. ఆమెను హైదరాబాద్‌కు తరలించారు. రాజమణి, కళావతితోపాటు మరో ముగ్గురికి గాయాలయ్యాయి.

ఇలా కుక్కలు ఎక్కడపడితే అక్కడ గుంపులుగుంపులుగా తిరుగుతూ దాడి చేస్తూ పిక్కలు పీకుతున్నాయి. వార్డుల్లో శునకాల బెడదపై తరచూ పురపాలక అధికారులకు విన్నవించినా చర్యలకు మీనమేషాలు లెక్కిస్తున్నారు. దీంతో ప్రజలు కాలనీల్లోని రోడ్లపై నడవాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది.




బుధవారం కామారెడ్డిలో కుక్క దాడిలో గాయపడిన మహిళ

నెలల వారీగా నమోదైన కేసులు

ఏప్రిల్	40
మే	28
జూన్	16
జులై	42
ఆగస్టు	56
సెప్టెంబరు	32

శాశ్వత పరిష్కారం చూపితేనే..

జిల్లా కేంద్రం పరిధిలోని విలీన గ్రామం రామేశ్వర్‌పల్లి వద్ద శునక సంతతి నియంత్రణకు ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేశారు. ఇప్పటికే వందలాది శునకాలను కేంద్రానికి తెచ్చారు. అయినా అంతర్గత కాలనీల్లో రోజూ శునకాల దాడి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. శాశ్వత పరిష్కారం చూపితేనే సమస్య నుంచి ఉపశమనం లభిస్తుందని ప్రజలు కోరుతున్నారు.

వేరే చోటుకే సిఫారసు..

మొన్నటి వరకు వంద పడకల ఆసుపత్రిగా ఉన్న కామారెడ్డి జీజీహెచ్‌కు ప్రస్తుతం బోధనా సుపత్రి హోదా దక్కింది. వైద్య సేవలు మెరుగుపడాల్సి ఉన్నా.. ఇక్కడ చర్యలు లేవు. కుక్కకాటుకు గురై తీవ్ర గాయాలు అయితే నిజామాబాద్ లేదా హైదరాబాద్‌కు సిఫారసు చేస్తున్నారు. తీవ్ర గాయాలకు ఔషధాల నిల్వ చేసే పరిస్థితి లేదు. కుక్క కాట్లపై కామారెడ్డి పురపాలక ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్వేజ్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. రోడ్లపై వ్యర్థాలు పారేయడంతో వాటిని తినడానికి కుక్కలు వస్తున్నాయన్నారు. ప్రజలు వాటిని చూసి బెదరడంతో అవి మీదికి వచ్చి దాడి చేస్తున్నాయన్నారు. ఇప్పటికే కుక్కల సంతతి నియంత్రణకు కేంద్రం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

పైప్‌లైన్ పనుల పూర్తికి ఆదేశం

పిట్లం, న్యూస్‌టుడే: పిట్లం కస్తూర్బా విద్యాలయంలో పైఅంతస్తులోని ట్యాంకుకు నీరు చేరక విద్యార్థులు బకెట్లతో పైకి తీసుకెళ్తూ ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య బుధవారం 'ఈనాడు' ప్రధాన సంచికలో 'పాతాళంలో నీళ్లు.. విద్యార్థినుల కన్నీళ్లు' శీర్షికన చిత్ర కథనం ప్రచురితం కావడంతో జిల్లా అధికారులు స్పందించారు. పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ ఆదేశాల మేరకు విద్యాలయాన్ని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సందర్శించారు. విద్యాలయం సంప్ వరకు మిషన్ భగీరథ నీరు వస్తోందని, భవనం పైనున్న నీటి ట్యాంకుకు నీరందకపోవడమే సమస్య అని ఆమె తెలిపారు. సంప్ నుంచి మోటారు సాయంతో నీటి సరఫరా చేస్తున్నారన్నారు. కాలకృత్యాలకు మాత్రమే విద్యార్థినులు నీళ్లు పైకి తీసుకెళ్తున్నారని, పైకి నీరు సరఫరా అయ్యే పైపులైను పనులను గురువారం పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలలోని మరో బోరు పంపును కూడా వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి, బాలుర ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ, భవిత కేంద్రాలు, జ్యోతిబా పులే గురుకులాన్ని తనిఖీ చేశారు. వెంట భగీరథ ఈఈ రమేష్, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో కమలాకర్, ఎంపీవో యాదగిరి, శీతల్ దేశాయ్, కస్తూర్బా ప్రత్యేకాధికారిణి సరిత తదితరులున్నారు.



సంపు నుంచి మోటారు ద్వారా సరఫరా అవుతున్న నీటిని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి, తదితరులు

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: కస్తూర్బాలో నీళ్ల సమస్యపై జిల్లా న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్ సీహెచ్‌వీఆర్ఆర్ వరప్రసాద్ స్పందించారు. సమస్యను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు పాఠశాలకు చేరుకొని విద్యుత్తు మోటార్ ఏర్పాటు చేయించారు. డీఈవోను జిల్లా న్యాయమూర్తితోపాటు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.నాగరాణి అభినందించారు.

సంక్షేమ పథకాలు అందేలా చూడండి

నస్రుల్లాబాద్, న్యూస్‌టుడే : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ జాన్‌వెస్లీ పేర్కొన్నారు. బుధవారం మీర్జాపూర్‌లో ఆయన పర్యటించారు. ఐసీడీఎస్, ఐకేపీ అధికారులను గ్రామ పంచాయతీకి పిలిపించారు. అంగన్‌వాడీలో వసతులు ఉన్నాయా? లేదా? అని తెలుసుకున్నారు. చిన్నారుల పౌష్టికాహారంపై ఆరా తీశారు. గ్రామంలో ఎన్ని డ్వాక్రా సంఘాలు ఉన్నాయి? ఎంత రుణాలు తీసుకున్నారు? అని వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎల్పీవో నాగరాజు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో సూర్యకాంత్, పంచాయతీ కార్యదర్శి రవి, ఎంఎల్‌హెచ్‌పీ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.


మీర్జాపూర్‌లో వివరాలు తెలుసుకుంటున్న జాన్‌వెస్లీ

తప్పులు సవరించాల్సిందే..!

జుక్కల్, న్యూస్‌టుడే: రైతుల బ్యాంకు ఖాతాల వివరాల్లో దొర్లిన తప్పులను అధికారులు సవరించాల్సిందేనని, అర్హులైన ప్రతి ఒక్కరికి రుణమాఫీ చేయాల్సిందేనని ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు తోట అన్నారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో బ్యాంకు మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. సాంకేతిక సమస్యలతో రుణమాఫీ కాక ఇబ్బందులు పడుతున్న రైతులకు సహకరించాలని కోరారు. వివిధ సమస్యలతో కార్యాలయానికి వచ్చిన ప్రజల వినతులను పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు.


బ్యాంకు మేనేజర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు

తెగుళ్ల నివారణకు సస్యరక్షణ కీలకం

న్యూస్‌టుడే, కోటగిరి

పంటలకు ఆశించిన చీడపీడలు, తెగుళ్ల నివారణకు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. వర్షాలు, వాతావరణ మార్పులు, చీడపీడలు, తెగుళ్లు కర్షకులను కలవరపెడుతున్నాయి. ఈ నేపథ్యంలో అన్నదాతల సందేహాలు నివృత్తి చేసేందుకు బుధవారం కేవీకే శాస్త్రవేత్తలతో 'ఈనాడు' ఫోన్-ఇన్ నిర్వహించింది. రైతుల సందేహాలను శాస్త్రవేత్తలు డా.వెంకటరాజకుమార్, డా.శ్వేత, డా.విజయ్‌కుమార్ నివృత్తి చేశారు.

'ఈనాడు' ఫోన్-ఇన్‌లో రుద్రూర్ కేవీకే శాస్త్రవేత్తలు


రైతుల ప్రశ్నలకు సమాధానాలు ఇస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు వెంకటరాజకుమార్, శ్వేత, విజయ్‌కుమార్

● **ప్రశ్న:** వరిలో మానిపండు/కాటుక తెగులు, కంకినల్లి నివారణ ఎలా? **- సాయిలు, కోటగిరి, రాజేందర్, డిచ్‌పల్లి**

■■ **సమాధానం :** మానిపండు తెగులు నివారణకు ప్రాఫికొనజోల్ 1 మి.లీ లేదా కార్బండాజిమ్ 50శాతం డబ్ల్యూపీ 1గ్రా లీటర్ నీటికి కలుపుకొని వెన్నులు పైకి వచ్చే దశలో ఓసారి, వారం తర్వాత మరోసారి పిచికారీ చేయాలి. కంకి నల్లి నివారణకు స్పైరోమెసిఫెన్ 1 మి.లీ లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

● టమాటా లోపల రంధ్రాలు అవుతున్నాయి. ఆకులపై మచ్చలు ఏర్పడుతున్నాయి **- తారాచంద్, శంకోర, జహంగీర్, కందకుర్తి**

■■ సూది పురుగు నివారణకు ఎకరాకు 4-5 లింగాకర్షక ఎరలు ఏర్పాటు చేసుకోవాలి. పురుగు ఆశించిన కాయలు, పండ్లను కాల్చేయాలి. క్లోరంత్రనీలిప్రోల్ 18.5 శాతం ఎస్.సి 0.2 మి.లీ లేదా స్పైనోశాడ్ 0.3మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఆకు మాడు తెగులు నివారణకు మెటిరాం, పైరాక్లోస్ట్రోబిన్ 3గ్రా లీటరు నీటికి లేదా అజాక్సీస్ట్రోబిన్, డైఫెన్కొనజోల్ 1.మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

● వరిలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు, సుడిదోమ నివారణ, సెనగ రకాలు, విత్తు సమయం, ఎరువుల యాజమాన్యం వివరించగలరు? **- అర్జున్‌రావు, హెగ్డోలి**

■■ నివారణకు తెగులు 5శాతం కంటే ఎక్కువ సోకినపుడు నత్రజని వేయడాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలి. 1-2 సార్లు పొలంలోని నీటిని పూర్తిగా బయటకు పంపాలి. అగ్రిమైసిన్ 0.4గ్రా లేదా ప్లాంటోమైసిన్ లేదా పోషమైసిన్ 0.2గ్రా లీటరు నీటిలో కలిపి 5-7 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయడంతో పాటు పొటాష్‌ను ఎకరాకు 10-15 కిలోలు వేసుకోవాలి. సుడిదోమ వ్యాపిస్తున్న పొలాన్ని ఆరబెడుతూ పాయలు తీయాలి. తొలి దశలో బ్యుప్రొఫెజిన్ 1.6 మి.లీ లేదా ఎసిఫేట్, ఇమిడాక్లోప్రిడ్ 1.5గ్రా లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్ల వద్ద పిచికారీ చేయాలి. నల్లరేగడి నేలల్లో సెనగ సాగు చేయడానికి ఎన్.బి.ఈ.జి-3, జె.జి-11, ఎన్.బి.ఈ.జి-47 రకాలు అనుకూలం. నవంబరు 15లోపు విత్తుకుంటే మంచి దిగుబడి వస్తుంది. 20 కిలోల యూరియా, 100కిలోల ఎన్.ఎస్.పి, 15కిలోల ఎం.ఓ.పి, లేదా ఒక బస్తా డీఏపీ, 15 కిలోల ఎం.ఓ.పి వేసుకోవాలి.

● పసుపులో దుంపకుళ్లు, దుంప ఈగ, మర్రి ఆకు (తాటాకు మచ్చ) తెగులు నివారణ వివరించండి? **- నర్సయ్య, ప్రవీణ్, శెట్పల్లి(బి), సాగర్, మోర్తాడ్**

■■ దుంపకుళ్లు నివారణకు లీటరు నీటికి 2.5గ్రా మెటలాక్సిల్, మాంకోజెబ్ లేదా 3గ్రా కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి తెగులు సోకిన మొక్కల చుట్టూ మొదలు తడిసేలా పోయాలి. దుంప ఈగ లక్షణాలు గమనించిన వెంటనే ఎకరాకు 200 కిలోల వేప పిండి వేసుకోవాలి. మచ్చలు ఉన్న, ఎండిన ఆకులు తొలగించి కాల్చేయాలి. లీటరు నీటికి 1మి.లీ ప్రాఫికొనజోల్ లేదా 2గ్రా మాంకోజెబ్ కలిపి 15 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలి.

● వంకాయలో కొమ్మ కొనలు వడలిపోయి కాయలకు పుచ్చులు వస్తున్నాయి. **- శ్రీనివాస్, అఫందిఫారం**

■■ నివారణకు క్లోరంత్ర నీలిప్రోల్ 18.5శాతం ఎస్.సి 0.2 మి.లీ లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 5శాతం ఎస్.జి 0.4గ్రా లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

● పత్తిలో గులాబీ పురుగు నివారణ తెలుపండి? **- సురేష్, కొప్పర్గ**

■■ ఎకరాకు 8 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి. పురుగు ఉద్ధృతి పరిశీలించి ప్రొఫినోఫాస్ 2మి.లీ లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4గ్రా లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

● కుసుమ రకాలు, విత్తు సమయం, విత్తన శుద్ధి ఎలా? **- కిషన్‌రావ్, సుంకిని**

■■ మంజీర, పి.ఎన్.బి.ఎస్-12, టి.ఎస్.ఎఫ్-1 రకాలు నల్లరేగడి నేలల్లో నవంబరు 15లోపు విత్తుకోవాలి. ఒక కిలో కుసుమ విత్తనానికి 3గ్రా కాప్టాన్ లేదా థైరమ్ లేదా కార్బండాజిమ్ 1గ్రా కలిపి విత్తనశుద్ధి చేయాలి.

వైద్యుల భర్తీకి ప్రకటన

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: కామారెడ్డి జిల్లాలో వైద్య విధానపరిషత్ పరిధిలోని ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టినట్లు జిల్లా ఆసుపత్రుల పర్యవేక్షకురాలు విజయలక్ష్మి ఓ ప్రకటనలో వెల్లడించారు. గైనకాలజీ కామారెడ్డిలో 2, బాన్సువాడలో 2, ఎల్లారెడ్డిలో 2, దోమకొండలో 1, మత్తు వైద్య నిపుణులు ఎల్లారెడ్డిలో 1, దోమకొండలో 1, మద్నూర్‌లో 1, జనరల్ సర్జన్ బాన్సువాడలో 1, ఎల్లారెడ్డిలో 1, దోమకొండలో 1, మద్నూర్‌లో 1, పిల్లల వైద్య నిపుణులు కామారెడ్డిలో 2, బాన్సువాడలో 3, ఎముకల వైద్య నిపుణులు కామారెడ్డిలో 1, జనరల్ మెడిసిన్ కామారెడ్డిలో 2, జనరల్ జీడీఎంవో కామారెడ్డిలో 4, బాన్సువాడలో 2, మద్నూర్‌లో 1 పోస్టులు భర్తీ చేస్తామన్నారు. ఆసక్తిగల వారు అక్టోబరు 1న నిజ ధ్రువపత్రాలతో డీసీహెచ్ఎస్ కార్యాలయానికి రావాలని సూచించారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో మౌఖిక పరీక్ష నిర్వహిస్తామన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి

న్యూస్‌టుడే, నిజామాబాద్ కలెక్టరేట్

ఏళ్లుగా ట్రాన్స్‌జెండర్లు వివక్ష ఎదుర్కొంటున్నారు. పనికి వెళ్దామంటే ఎవరూ పిలవని పరిస్థితి. చాలా మంది ఊరిని, కన్నవారిని వదిలేసి ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. పట్టణాలు, నగరాల్లో భిక్షాటన చేస్తూ బతుకు వెళ్లదీస్తున్నారు. ఈ పరిస్థితుల్లో వారు గౌరవంగా జీవించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించాలని మార్గదర్శకాలు జారీ చేసింది. సొంత ఊరులోనే ఉపాధి పొందేందుకు జాబ్ కార్డు మంజూరు చేయాలని నిర్ణయించింది.

మార్గదర్శకాలు ఇలా...

- ఆధార్ ఆధారంగా జాబ్ కార్డు ఇవ్వాలి.
- ఒక గ్రామంలో ఇద్దరి కంటే ఎక్కువ మంది ఉంటే గ్రూపు ఏర్పాటు చేయాలి. లేదంటే వ్యక్తిగతంగా ఒకే ప్రాంతంలో పని కల్పించాలి.
- పని ప్రదేశంలో వారిపై వివక్ష చూపొద్దు.
- సమస్యల పరిష్కారానికి మండల, జిల్లా స్థాయిలో నోడల్ అధికారిని నియమించాలి.

ఉమ్మడి జిల్లాలో 62 మందికి లబ్ధి..

ఓటరు జాబితా ప్రకారం ఉమ్మడి జిల్లాలో 62 మంది ట్రాన్స్‌జెండర్లున్నారు. నియోజకవర్గాల వారీగా ఆర్మూర్-6, బోధన్-4, బాన్సువాడ-13, నిజామాబాద్ గ్రామీణం-6, బాల్కొండ-2, జుక్కల్-9, ఎల్లారెడ్డి-2, కామారెడ్డి 20 మంది నమోదయ్యారు. జాబితాలో పేర్లు లేని వారు సైతం ఉన్నారు. 18 ఏళ్లు నిండిన వారికి జాబ్ కార్డు ఇవ్వనున్నారు.

వసతులు కల్పిస్తాం..

పల్లెల్లో ఎంత మంది ఉన్నారనేది గుర్తిస్తాం. అడిగిన వారందరికీ జాబ్ కార్డు ఇస్తాం. పని ప్రదేశంలో కావాల్సిన వసతులు ఉంటాయి. వారిపై వివక్ష చూపకుండా మిగతా కూలీలకు అవగాహన కల్పిస్తాం.
- సాయాగౌడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి


మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కొత్త ఓటర్ల నమోదుకు సహకరించాలి

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: అర్హత కలిగిన వారిని కొత్త ఓటర్లుగా నమోదు చేయించాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బూత్‌స్థాయి అధికారులతో సమన్వయం చేసుకునే విధంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు బూత్ ఏజెంట్లను నియమించుకోవాలని కోరారు. నవంబరు 9, 10వ తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు ఉంటాయన్నారు. వచ్చే ఏడాది జనవరి 6న తుది ఓటరు జాబితా విడుదల చేస్తామని పేర్కొన్నారు. ఇప్పటివరకు కామారెడ్డి నియోజకవర్గంలో 97.52 శాతం, జుక్కల్‌లో 98.02 శాతం, ఎల్లారెడ్డిలో 99.24 శాతం ఇంటింటి సర్వే పూర్తిచేసినట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు సరళ తదితరులు పాల్గొన్నారు.

సినిమా సెట్టు కాదు.. అంతర్రాష్ట్ర రహదారి



చీల్చిన కొండ.. మధ్యలోంచి రహదారి.. గుహను తలపించే మలుపు తిరిగిన దారి.. చూస్తుంటే.. ఇదేదో సినిమా సెట్టింగ్ అనుకుంటున్నారేమో... అలా అనుకుంటే పొరబడినట్లే.. ఇది తెలంగాణ - కర్ణాటక రాష్ట్రాలను కలిపే రహదారి. కామారెడ్డి జిల్లా జుక్కల్ మండల కేంద్రం నుంచి దోస్త్‌పల్లి, డోన్‌గావ్, సోపూర్ మీదుగా కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లాలో పలు ప్రాంతాలను కలుపుతుంది. జుక్కల్ మండల ప్రజలకు బీదర్ జిల్లా వాసులతో బంధుత్వాలున్నాయి. తరచూ రాకపోకలు సాగిస్తుంటారు. అయితే గతంలో ఈ రోడ్డు ఒకే వరుస ఉండేది. దీనిని రెండు వరుసలుగా విస్తరించేందుకు నిధులు మంజూరు కావడంతో పనులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా దోస్త్‌పల్లి- డోన్‌గావ్ మధ్యలో గుట్ట పైకి వాహనాలు సులువుగా ఎక్కేందుకు వీలుగా కొండను తొలిచి నిర్మాణం చేపడుతున్నారు. సుమారు 100 మీటర్ల మేర ఎత్తైన గుట్టపై వేస్తున్న గుహలాంటి రోడ్డు ఆకట్టుకుంటోంది. నిర్మాణం పూర్తయితే కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లాకు రాకపోకలు సులువవుతాయి.

– ఈనాడు, నిజామాబాద్, న్యూస్‌టుడే, జుక్కల్

పర్యావరణమే ఆరోగ్య భాగ్యం

ఆరోగ్యమే మహాభాగ్యం... ఇది నిన్నటి మాట.

పర్యావరణమే ఆరోగ్య భాగ్యం.. ఇది నేటి మాట.

ప్రస్తుతం ఎవరిని పలకరించినా...ఏదో ఒక అనారోగ్య సమస్యను ప్రస్తావిస్తున్నారు. వాటిలో సింహభాగం వాతావరణ అనుబంధమైనవి ఉంటున్నాయి. ముఖ్యంగా ప్రాణాంతక వ్యాధుల్లో ఎక్కువగా దెబ్బతిన్న పర్యావరణంతో వచ్చినవి ఉండటం గమనార్హం. ప్రకృతి మనకిచ్చే గాలి, నీరు కలుషితమైతే మానవ మనుగడ ప్రమాదంలో పడుతుంది. ఇప్పటికే ఎదుర్కొంటున్న వ్యాధుల నుంచి కనువిప్పు పొంది ప్రకృతిని కాపాడటానికి కంకణం కట్టుకోవాల్సిన తరుణమిది. ఈ నేపథ్యంలోనే ఏటా సెప్టెంబరు 26న పర్యావరణ ఆరోగ్య దినోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా మనిషి పర్యావరణానికి చేటు చేస్తున్న ప్రధాన అంశాలను ఒకసారి సమీక్షించుకుని నియంత్రణపై దృష్టి సారించాల్సిన అవసరముంది.

పెట్రోలు, డీజిల్ : ద్విచక్ర వాహనాలు, కార్లు.. ఇలా సొంత రవాణా సదుపాయాలు పెరగడంతో పెట్రోలు, డీజిల్ వినియోగం రెట్టింపైంది. దేశంలో తలసరి వార్షిక వినియోగం పెట్రోలు 26.78 లీటర్లు, డీజిల్ 74.54లీటర్లు. ఇక లీటరు పెట్రోలు కాలిస్తే 2.3కిలోల కార్బన్‌డైఆక్సైడ్ గాలిలో కలుస్తుంది. అది డీజిల్‌లో 2.54 కిలోలు ఉంది. వినియోగంలో ఒక లీటరు తగ్గించినా దాదాపు మూడు కిలోల కర్బన ఉద్గారాలు తగ్గుతాయి.



విద్యుత్తు : రాష్ట్ర తలసరి వార్షిక విద్యుత్తు వినియోగం 2126 యూనిట్లు. అంటే రోజుకు 5.82 యూనిట్లు వినియోగిస్తున్నట్లు. ఒక యూనిట్ విద్యుత్తు కోసం పర్యావరణంలోకి 0.85- 1.1 కిలోల కార్బన్‌డైఆక్సైడ్ విడుదల చేయాల్సి వస్తుంది. ఒక వ్యక్తి ఉపయోగించే రోజువారీ విద్యుత్తుతో ఆరు కిలోల కార్బన్‌డైఆక్సైడ్ విడుదలవుతోంది. పొదుపుతో ఒక యూనిట్ తగ్గించినా పర్యావరణానికి మేలు.



ఆహారం : మనిషి బతకడానికి తీసుకునే ఆహారాన్ని వృథా చేస్తే పర్యావరణానికి ముప్పు. ఏటా ఒక మనిషి 55కిలోల ఆహారం వృథా చేస్తున్నట్లు లెక్కగట్టారు. ఒక కిలో ఆహారోత్పత్తికి పర్యావరణంలోకి 2.5కిలోల కార్బన్‌డైఆక్సైడ్ చేరుతుంది.



ప్లాస్టిక్ : రోజువారీ జీవితంలో ప్లాస్టిక్ భాగమైంది. శరీరంలోకి చొచ్చుకెళ్లిందని నిపుణులు చెబుతున్నారు. అంతలా పెనవేసుకున్న ప్లాస్టిక్ వార్షిక తలసరి వినియోగం 11కిలోలు. ఒక కిలో ప్లాస్టిక్ కాల్చితే 2.9కిలోల కార్బన్‌డైఆక్సైడ్ వెలువడుతుంది. అలాగే కిలో మొత్తంలో ప్లాస్టిక్ వినియోగిస్తే ఆరు కిలోల కార్బన్‌డైఆక్సైడ్ ఉత్పత్తవుతుంది.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలు : స్మార్ట్‌ఫోన్, టీవీలు.. ఇలా మనిషి రోజువారీ అవసరాలు తీర్చే వాటిలో ఎలక్ట్రానిక్ వస్తువులు అంతర్భాగమయ్యాయి. ఏటా ఒక వ్యక్తి 2.4కిలోల ఎలక్ట్రానిక్ వ్యర్థాలు ఉత్పత్తి చేస్తున్నట్లు లెక్కగట్టారు. ఈ వ్యర్థాలతోనూ పర్యావరణంలోకి విష వాయువులు చేరుతున్నాయి.

మొక్కలు : ఏటా నివాస గృహాల్లో లక్షలాది మొక్కలు నేలవాలుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో సగటున వంద ఎకరాలకైనా వ్యవసాయ భూములు కాంక్రీటు వనాలుగా మారుతున్నాయి. ఇళ్లు కట్టడానికి ఉన్న మొక్కలు నరికేయడం, గృహోపకరణాలకు వాడే కలప కోసం విలువైన వృక్షాలు అంతరించిపోతున్నాయి.





న్యూస్‌టుడే, ఇందూరు ఫీచర్స్

జిల్లాపై ప్రభావం ఇలా..

ఉమ్మడి జిల్లాలో దాదాపు 28లక్షల జనాభా ఉంది. వివిధ అంశాల్లో జాతీయ సగటు లెక్కగడితే.. పర్యావరణంలో జిల్లా ప్రజల కాలుష్య పాత్ర తెలుస్తుంది. ఉదాహరణకు విద్యుత్తు తీసుకుంటే.. రాష్ట్ర తలసరి విద్యుత్తు వినియోగం 2126 యూనిట్లు. 28లక్షల జనాభాకు లెక్కిస్తే వందల కోట్ల యూనిట్లకు చేరుతుంది. ఒక వ్యక్తి రోజుకో యూనిట్ వినియోగం తగ్గిస్తే.. ఏడాదిలో 365 యూనిట్లు ఆదా అవుతుంది. ఫలితంగా దాదాపు 700 కిలోల కార్బన్‌డైఆక్సైడ్‌ను గాలిలో కలవకుండా నిరోధించిన వారమవుతాం. ఇలా అన్ని విభాగాల్లోనూ లెక్కేసుకుంటే ఎంత నష్టం కలిగించి.. మన ఆరోగ్యాన్ని ఎంత నష్టపరచుకుంటున్నామన్నది తెలుస్తుంది.



ఉమ్మడి జిల్లాలో వాహనాలు దాదాపు 5 లక్షలు

అన్ని రకాల విద్యుత్తు కనెక్షన్లు
కామారెడ్డి : 4.22 లక్షలు
నిజామాబాద్ : 7.50 లక్షలు

26 రోజులు.. 650 కిలో మీటర్లు

జుక్కల్, న్యూస్‌టుడే: స్వామి శ్రీనరేంద్ర చార్యజీ మహరాజ్ తెలంగాణ ఉప పీఠం నుంచి మహారాష్ట్రలోని నాణీజ్‌ధామ్ (దక్షిణ భారత్ పీఠం) వరకు చేపట్టిన 'వసుంధర పాదయాత్ర' బుధవారం ప్రారంభమైంది. మూడు రాష్ట్రాల్లోని (తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర) 10 జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు తోట, మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే హాజరై, స్వామీజీ పాదుకలతో కూడిన పల్లకిని మోశారు. ఈ పాదయాత్ర 26 రోజుల పాటు 650 కి.మీ దూరం కొనసాగుతోందని భక్తులు తెలిపారు. స్వామీజీ సందేశాలను ఫ్లెక్సీలపై ముద్రించి వాటిని ప్రదర్శిస్తూ భక్తులు యాత్ర సాగించారు. కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ శివానంద్, నాయకులు దాదారావు పటేల్, రమేశ్ దేశాయ్, సతీష్ పటేల్, భక్తులు, పీఠం నిర్వాహకులు పాల్గొన్నారు.





పల్లకీ మోస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు తోట, ఫ్లెక్సీలతో పాదయాత్ర చేస్తున్న భక్తులు

విదేశీ విద్యపై అవగాహన

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో టీఎస్‌కేసీ, కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో ఐఏఈసీ కన్సల్టెన్సీ ప్రతినిధులు డిగ్రీ తృతీయ సంవత్సర విద్యార్థులకు విదేశీ విద్యపై బుధవారం అవగాహన కల్పించినట్లు వైస్ ప్రిన్సిపల్ అబ్దుర్ రఫీక్ తెలిపారు. విదేశీ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు, చదువుతూ పనిచేసే అవకాశాలను వివరించారు. కన్సల్టెన్సీ ఛైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, కెరీర్ గైడెన్స్ సెల్ సమన్వయకర్త రామకృష్ణ, వినయ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న వైస్ ప్రిన్సిపల్ రఫీక్

28న అథ్లెటిక్స్ ఎంపికలు

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: నిజామాబాద్ జిల్లా నాగారంలోని రాజారాం స్టేడియంలో ఈ నెల 28న ఉదయం 10 గంటలకు అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరాల రత్నాకర్, రాజాగౌడ్ ప్రకటనలో తెలిపారు. అండర్- 14, 16, 18, 20 బాల బాలికల విభాగాల్లో ఎంపికలుంటాయని పేర్కొన్నారు. ఎంపికైన వారు వచ్చేనెల 7, 8 తేదీల్లో హన్మకొండలో జరిగే జూనియర్ అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. దరఖాస్తులు ఈ నెల 27 సాయంత్రం 5 గంటలలోపు చేసుకోవాలని, వివరాలకు చరవాణి నంబర్ 99890 40776లో సంప్రదించాలన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జడ్పీహెచ్‌ఎస్(మంచిప్ప)లో ఈనెల 28న నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల క్రీడాకారులకు రెజ్లింగ్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగమణి ప్రకటనలో తెలిపారు.



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన మున్సిపల్ కార్మికులు

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజనర్సు మాట్లాడుతూ.. కార్మికులకు 26 నెలలుగా పీఎఫ్ కట్ చేస్తున్నప్పటికీ ఖాతాల్లో జమకావడం లేదన్నారు. ఈఎస్‌ఐ డబ్బులు కూడా ఖాతాల నుంచే కట్ అవుతున్నాయని ఆరోపించారు. కార్మికుల కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. అక్టోబరు 8వ తేదీ నాటికి సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, మహబూబ్, ప్రభాకర్, ప్రభు, భూలక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతోనే ఉత్తమ ఫలితాలు

తెవివి క్యాంపస్, న్యూస్‌టుడే: అధ్యాపకులు బోధించే విద్య విజ్ఞానాన్ని పెంచేందుకు దోహదపడాలని తెవివి రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి అన్నారు. జాతీయ విద్యా విధానం-2020పై వర్సిటీలో బుధవారం అకడమిక్ ఆడిట్ సెల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. నూతన విద్యా విధానంలో విద్యార్థులతో పాటు అధ్యాపకుల భాగస్వామ్యం ఉన్నప్పుడే ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య చంద్రశేఖర్, పరీక్షల నియంత్రణాధికారి అరుణ, వర్సిటీ బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ సాయిలు, వర్సిటీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఆరతి, అధ్యాపకులు శంకర్, ఆంజనేయులు, సంపత్, రాంబాబు, రవీందర్‌రెడ్డి, నందిని తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి

అధ్యాపకులు పరిజ్ఞానం పెంచుకోవాలి

తెవివి క్యాంపస్, న్యూస్‌టుడే: అకౌంట్స్‌లో మారుతున్న కాలానికి అనుగుణంగా అధ్యాపకులు పరిజ్ఞానం పెంచుకోవాలని రిజిస్ట్రార్ యాదగిరి పేర్కొన్నారు. వర్సిటీలోని కామర్స్ విభాగంలో 'క్లిక్-టెర్న్-టీచ్ టాలీ ప్రైమ్' అనే అంశంపై బుధవారం ఏర్పాటు చేసిన కార్యశాలకు రిజిస్ట్రార్ హాజరయ్యారు. అకౌంట్స్ నిర్వహణ, నివేదికల రూపకల్పన, టాలీ ప్రాముఖ్యంపై శిక్షకుడు జగదీశ్వర్ ప్రసంగించారు. ప్రిన్సిపల్ ఆచార్య ఆరతి, డైరెక్టర్ ఆచార్య గోపిశెట్టి రాంబాబు, కార్యశాల కన్వీనర్లు శ్రీనివాస్, శ్వేత, అధ్యాపకులు గంగాధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి

తెవివి క్యాంపస్: హైకోర్టు ఉత్తర్వులు, అడ్వొకేట్ జనరల్ న్యాయ సలహా మేరకు షరతులతో కూడిన పదోన్నతులను అమలు చేయాలంటూ తెవివిలో 2014 ఏడాదిలో నియామకం పొందిన అధ్యాపకులు డిమాండ్ చేశారు. బుధవారం రిజిస్ట్రార్ యాదగిరికి టూటా ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. అంతకు ముందు టూటా అధ్యక్షుడు పున్నయ్య అధ్యక్షతన తొలుత సమావేశం నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి మోహన్ బాబు, కోశాధికారి నాగరాజు, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, రాజేశ్వరి, కార్యదర్శులు బాలకిషన్, నీలిమా, సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థి సంఘాల నాయకులతో డీఎస్పీ నాగేశ్వర్‌రావు, గ్రామీణ సీఐ రామన్ తదితరులు

శాంతి భద్రతల పరిరక్షణలో భాగస్వాములవ్వాలి

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. డీఎస్పీ కార్యాలయ ఆవరణలో జిల్లా కేంద్రంలోని వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, వివిధ సామాజిక వర్గాలకు చెందిన పెద్దలతో బుధవారం నిర్వహించిన సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగమవుతామని ప్రతిజ్ఞ చేశారు. కామారెడ్డి గ్రామీణ సీఐ రామన్ తదితరులున్నారు.

పోలీసు పికెటింగ్

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ఓ పాఠశాలలో జరిగిన ఘర్షణ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బుధవారం అడుగడుగునా పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తా, పాఠశాల, బడా మజీద్, పాత బస్టాండ్ తదితర ప్రాంతాల్లో నిర్వహించారు. ఇతర జిల్లాల పోలీసు బలగాలు కూడా ఇందులో పాల్గొన్నాయి.

విద్యాసంస్థల బంద్

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో బుధవారం ప్రైవేటు విద్యాసంస్థలు బంద్ పాటించాయి. ఇటీవల ఓ ప్రైవేటు పాఠశాలలో ఓ విద్యార్థినిపై ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తనను నిరసిస్తూ విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు, ఆయా పక్షాల ప్రతినిధులు నిరసన తెలిపిన సంగతి తెలిసిందే. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యాలయాలను మూసి ఉంచాలని సూచించారు. బడిలో జరిగిన ఘటనపై డీఈవో రాజు వివరాలు సేకరించారు. తాజాగా బడికి వచ్చి వివరాలు ఆరా తీశారు. ఘటన జరిగిన బడికి మూడు రోజులపాటు సెలవులు ప్రకటించినట్లు డీఈవో వెల్లడించారు. బడిలో జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరపాలని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అధికారులను కోరినట్లు తెలిసింది. తప్పు జరిగితే నిందితుడిపై చర్యలు తీసుకోవాలని అన్నట్లు సమాచారం.

షూటింగ్‌లో స్వర్ణం

కామారెడ్డి క్రీడావిభాగం, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో జరుగుతున్న 68వ ఎస్‌జీఎఫ్ క్రీడల్లో కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన క్రీడాకారిణి పేరం అక్షిత స్వర్ణ పతకం సాధించింది. ఈ విద్యార్థిని హైదరాబాద్‌లోని ఓ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఈనెల 21- 23వ తేదీ వరకు నిర్వహించిన అండర్-17 రైఫిల్ షూటింగ్ పోటీల్లో పాల్గొందన్నారు.



బంగారు పతకం చూపుతున్న పేరం అక్షిత

నాటిన మొక్కలు సంరక్షించాలి

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని యోగాభవన్ ఆవరణలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఔషధ, పండ్ల మొక్కలు నాటి మాట్లాడారు. నాటిన మొక్కలను సంరక్షించాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కామారెడ్డిలో చక్కగా యోగా భవన్ నిర్మించుకున్నారని అభినందించారు. యోగాసన స్పోర్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యోగా రాంరెడ్డి, కార్మికశాఖ ఏడీ కోటేశ్వర్‌రావు, వేణు, అనిల్‌రెడ్డి, రమేశ్, వెంకటేశం, రాజేందర్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



యోగా అభ్యాసకులతో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

పునరాలోచన చేయండి

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు విషయమై ప్రభుత్వం పునరాలోచన చేయాలని డీటీయూ ప్రతినిధులు హరికిషన్, అశోక్, స్వామి, రమేశ్‌లు బుధవారం డీఈవో రాజుకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అధికంగా ఉన్న ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేయాలని కోరారు. యూపీఎస్‌లలో తరగతికి ఒక ఉపాధ్యాయుడు, పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిని నియమించాలన్నారు. పెండింగ్‌లోని 5 డీఏలను విడుదల చేయాలని కోరారు. జీవో 317 ద్వారా నష్టపోయిన వారికి న్యాయం చేయాలన్నారు. ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు.



డీఈవో రాజుకు వినతిపత్రం అందజేస్తున్న డీటీయూ ప్రతినిధులు

ప్రేమను తిరస్కరించిందని.. యువకుడి ఆత్మహత్య



అజయ్

ఇందల్‌వాయి, న్యూస్‌టుడే: ప్రేమించిన యువతి తిరస్కరించిందని ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై మనోజ్‌కుమార్, స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని సిర్నాపల్లికి చెందిన హొన్నాజీపేట్ అజయ్(21) హైదరాబాద్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేసి ఉద్యోగానికి ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలో పరిచయమైన ఓ యువతిని ప్రేమించగా తిరస్కరించింది. తీవ్ర మనస్తాపానికి గురైన అజయ్ ఈ నెల 10వ తేదీన ఇంట్లో పురుగుల మందు తాగుతూ వీడియో తీసి యువతికి పంపించాడు. ఈ విషయం కుటుంబ సభ్యులకు చెప్పలేదు. తరచూ వాంతులు చేసుకోవడంతో వారు చికిత్స నిమిత్తం 13న మండల కేంద్రంలోని దవాఖానాకు, అక్కడి నుంచి జిల్లా ఆసుపత్రికి తరలించారు. 14వ తేదీన అజయ్ చరవాణిని అతడి సోదరి చూడగా పురుగుల మందు తాగుతూ యువతికి పంపిన వీడియో చాటింగ్‌లో కనిపించింది. చికిత్స పొందుతూ అజయ్ మంగళవారం సాయంత్రం మృతి చెందారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు బుధవారం స్థానిక ఠాణాలో ఫిర్యాదు చేశారు.

దక్షిణ ప్రాంగణంలో సైన్స్ సదస్సు నేడు

భిక్కనూరు, న్యూస్‌టుడే: తెవివి దక్షిణ ప్రాంగణంలో జంతుశాస్త్ర విభాగం, డైరెక్టరేట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్తంగా నిర్వహిస్తున్న సైన్స్ సదస్సును విజయవంతం చేయాలని ప్రిన్సిపల్ డా.సుధాకర్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ప్రతులను బుధవారం విడుదల చేశారు. జాతీయ సైన్స్ డే సందర్భంగా జంతుజాల సంరక్షణ విధాన రూపకల్పన అనే అంశంపై ఒక రోజు సదస్సును నిర్వహిస్తున్నామని, సంబంధిత విభాగం విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన సూచించారు.



ప్రతులు విడుదల చేస్తున్న దక్షిణ ప్రాంగణం ప్రిన్సిపల్ డా.సుధాకర్‌గౌడ్, అధ్యాపకులు

హత్యకేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

నిజామాబాద్ న్యాయవిభాగం న్యూస్‌టుడే: హత్యకేసులో నిజామాబాద్ గ్రామీణ మండలం ఖానాపూర్‌కు చెందిన బోనిశెట్టి గంగమల్లుకు యావజ్జీవ శిక్షతో పాటు, రూ.2 వేలు జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి కుంచాల సునీత బుధవారం తీర్పు వెలువరించారు. వివరాలిలా.. రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్ కొక్కండ రాంప్రసాద్ ఖానాపూర్‌లో స్థిరపడ్డారు. తన ఇంటి పక్కన ఉండే బోనిశెట్టి గంగమల్లు 2022 ఫిబ్రవరి19న రోడ్డు విషయంలో గొడవపడ్డాడు. దీంతో రాంప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గంగమల్లు ఇది మనసులో పెట్టుకుని అదే నెల 25న రాంప్రసాద్‌పై కర్రతో తలపై బాదడంతో అక్కడికక్కడే చనిపోయాడు. రాంప్రసాద్ కుమారుడు కార్తీక్ నిజామాబాద్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై కేసు నమోదు చేశారు. పోలీసుల తరపున జిల్లా కోర్టు పీపీ రవిరాజ్ వాదించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా జడ్జి నిందితుడికి శిక్ష విధించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
బాన్సువాడ 83284 29129
కామారెడ్డి 93970 82242



సమస్య: జిల్లా కేంద్రంలోని 22వ వార్డులో మురుగు కాల్వ పేరుకుపోయింది. తగిన చర్యలు తీసుకోవాలి. - ప్రసాద్, స్థానికుడు

స్పందన: ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో యంత్రంతో చర్యలు చేపట్టాం. సమస్య పరిష్కారానికి కృషి చేశాం. - పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

సమస్య: కస్బాపూర్ సెంట్రల్ నర్సరీ వద్ద రోడ్డు గుంతలమయంగా మారింది. రవి, గ్రామస్థుడు.

సమాధానం : గుంతలను పూడ్చి వేయిస్తాం. రవితేజ, ఏఈ. - న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం, రామారెడ్డి

పీఠం దక్కేదెవరికో..!

● అక్టోబరు 3న ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ ఎన్నిక
● ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే

ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ ఎన్నిక ఉత్కంఠ రేపుతోంది. అక్టోబరు 3వ తేదీన ఎన్నిక నిర్వహించాలని ఎన్నికల కమిషన్ బుధవారం నోటిఫికేషన్‌ను జారీ చేసింది. మున్సిపల్ కార్యాలయంలో ఆర్డీవో ప్రభాకర్ సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆ దిశగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

12 మంది ...

మొత్తం 12 మంది కౌన్సిలర్లు ఉండగా గతంలో ఇద్దరు భారాస అభ్యర్థి కుడుముల సత్యనారాయణ చైర్మన్ పీఠాన్ని దక్కించుకున్నారు. అనంతరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భారాస ఎమ్మెల్యే అభ్యర్థి ఓడిపోవడం... కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందడంతో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో సత్యనారాయణ హస్తం గూటికి చేరారు. ఇది జీర్ణించుకోలేని భారాస నాయకులు ఏప్రిల్ 27న అవిశ్వాసం పెడుతున్నట్లు కలెక్టర్‌కు లేఖను అందించారు. నిబంధనల ప్రకారం అప్పటి కలెక్టర్ జితేష్ వి పాటిల్ మే 18న ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఓటింగ్ నిర్వహించారు. 11 మంది కౌన్సిలర్లు చైర్మన్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారు. చైర్మన్ సత్యనారాయణ కోర్టుకు వెళ్లడంతో అవిశ్వాసం పెట్టిన్పటి ఫలితాలు వెల్లడించకూడదని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అనంతరం కొన్ని రోజుల పాటు చైర్మన్ అభ్యర్థిగా ఆయన కొనసాగారు.



ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయం

జులై 10న ..

అనంతరం భారాస అభ్యర్థులు కోర్టుకెళ్లడం.. ఫలితాలను ప్రకటించాలని తీర్పు ఇవ్వడంతో జులై 10తేదీన చైర్మన్ తన పదవిని కోల్పోయారు. అప్పటి నుంచి అధికారులు పాలన కొనసాగుతోంది. కొత్త చైర్మన్‌ను ఎన్నుకొనేందుకు అక్టోబరు 3న అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తదనంతరం జరిగిన పరిణామాల్లో కొందరు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరడంతో ఆ పార్టీ అభ్యర్థికి సంపూర్ణ మెజార్టీ ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో చైర్మన్ పీఠం ఎవరు దక్కించుకుంటారనే అంశం ఉత్కంఠ రేపుతోంది.

పైపులైన్ లీకేజీకి మరమ్మతులు

స్పందన

దోమకొండలోని పసుపుగల్ల చౌరస్తాలో రెండేళ్లుగా లీకేజీ అవుతున్న పైపులైన్‌కు బుధవారం మరమ్మతులు చేశారు. ఈ నెల 25న 'ఈనాడు'లో 'రెండేళ్లుగా లీకేజీ సమస్య' శీర్షికన వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి ప్రవీణ్‌కుమార్, గ్రామ కార్యదర్శి రమేష్ సిబ్బందితో కలిసి సమస్యను పరిష్కరించారు.

- న్యూస్‌టుడే,దోమకొండ



పనులు చేస్తున్న పంచాయతీ సిబ్బంది, పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి ప్రవీణ్‌కుమార్

హామీలు నెరవేర్చాలి

సదాశివనగర్, న్యూస్‌టుడే : రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ నెరవేర్చాలని జడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజేశ్వర్‌రావు డిమాండు చేశారు. సెప్టెంబరు 30లోపు రైతులందరికి రుణమాఫీ చేయాలని, వెంటనే రైతు బంధు నిధులను విడుదల చేసి ఎకరాకు రూ. 15వేలు పెట్టుబడి సహాయం అందించాలన్నారు. నాయకులు కలాలిసాయాగౌడ్, చాకలి లింగం తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, భాజపా నాయకులు

దీన్‌దయాళ్ బాటలో నడవాలి

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: పండిట్ దీన్‌దయాళ్ బాటలో ప్రతి ఒక్కరు నడవాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి నరేందర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు విపుల్, ఫ్లోర్ లీడర్ మోటూరి శ్రీకాంత్, పట్టణాధ్యక్షుడు భరత్, కౌన్సిలర్లు తదితరులున్నారు.

ప్రమాణ స్వీకారానికి ఆహ్వానం

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే : ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం సభ్యుల ప్రమాణ స్వీకారం ఈ నెల 27న తేదీన నిర్వహించనున్నట్లు చైర్మన్ మారెడ్డి రజిత తెలిపారు. ప్రమాణ స్వీకారానికి హాజరు కావాలని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్‌కు బుధవారం ఆహ్వాన పత్రికను అందించారు. వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, వెంకట్రాంరెడ్డి, సామెల్, ఆరీఫ్, సాయిలు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



ఎంపీ సురేష్ షెట్కార్‌కు ఆహ్వానపత్రికను అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రూ.2 లక్షల రుణమాఫీ చేయాలి

భిక్కనూరు, న్యూస్‌టుడే: ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేయాలని అంతంపల్లి సింగిల్ విండో పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. బుధవారం విండో అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రైతు భరోసా పథకం ద్వారా ఎకరానికి రూ. 15 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పల్వంచ(మాచారెడ్డి): పల్వంచ మండల కేంద్రంలో భారతీయ కిసాన్ సంఘ్ గ్రామ కమిటీని తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఆనంద్‌రావు ఆధ్వర్యంలో బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంతోష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా అశోక్, ప్రతినిధులు ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శి సాయిరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

దోమకొండ, న్యూస్‌టుడే: భారతీయ కిసాన్ సంఘ్ దోమకొండ గ్రామ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెద్దిరెడ్డి నారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడిగా రాజేందర్‌యాదవ్, కార్యదర్శిగా పుర్ర బాపురెడ్డి, ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

గాంధారి: ఎలాంటి షరతులు లేకుండా ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయాలని అఖిలపక్షం(వివిధ పార్టీల) నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో కేవలం 30శాతం మాత్రమే రుణమాఫీ చేశారని పేర్కొన్నారు. ఈ నెల 30న గాంధారిలో నిర్వహించే ధర్నాకు అధిక సంఖ్యలో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



తీర్మాన ప్రతిని చూపుతున్న విండో అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

బాధిత కుటుంబానికి పరామర్శ

బాన్సువాడ పట్టణం డీసీసీబీ మాజీ ఛైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి వ్యక్తిగత సహాయకుడు మల్లారెడ్డి తండ్రి సాయిరెడ్డి మృతిచెందడంతో బుధవారం పాత బాన్సువాడలో ఆయన భౌతిక కాయానికి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.



గోడప్రతుల ఆవిష్కరణ

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ గోడ ప్రతులను పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ బుధవారం విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి బావయ్య, పలువురు సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు

కామారెడ్డి కలెక్టరేట్: గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం డీఎల్‌పీవోలు, ఎంపీవోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ ఓటరు జాబితాలను నిర్ణీత సమయంలో ప్రచురించాలని ఆదేశించారు. పల్లెల్లో నిరంతరం పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని కోరారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం ఉండేలా చూడాలన్నారు. ఉపాధిహామీ పథకం కింద వ్యవసాయ అనుబంధ పనులు చేసుకోవచ్చని తెలిపారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీపీవో శ్రీనివాస్‌రావు, జడ్పీ సీఈవో చందర్ పాల్గొన్నారు.

సస్యరక్షణ చేపట్టాలి

చిన్నమల్లారెడ్డి(కామారెడ్డి గ్రామీణం),: వరిలో సహజ సస్య రక్షణ పద్ధతుల ద్వారా పర్యావరణం దెబ్బతినకుండా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ తెలిపారు. ఆయన బుధవారం రైతులతో కలిసి చిన్నమల్లారెడ్డిలో వరి పంటను పరిశీలించి మాట్లాడారు. ఏఈవో శ్రీనివాస్ రెడ్డి తదితరులున్నారు.

50 వసంతాల ప్రతుల ఆవిష్కరణ

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం 50 వసంతాల కార్యక్రమ ప్రతులను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రతినిధి సతీశ్ మాట్లాడారు. దోపిడీ లేని సమాజం కోసం తమ వంతు ప్రయత్నిస్తున్నామన్నారు. ప్రతినిధులు మోతీరాం, ప్రవీణ్, శేఖర్, సురేశ్ తదితరులున్నారు.

భూముల అభివృద్ధికి సహకరించండి

నాగిరెడ్డిపేట్,న్యూస్‌టుడే: మాసానిపల్లి గ్రామానికి చెందిన 20 మంది రైతులు తమ పంట పొలాల అభివృద్ధికి సహకరించాలని కోరుతూ తహసీల్దార్ శ్రీనివాస్‌కు బుధవారం వినతి పత్రం ఇచ్చారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

కామారెడ్డి పట్టణం, భిక్కనూరు, మాచారెడ్డి, బీబీపేట, దోమకొండ, న్యూస్‌టుడే: అర్హులైన వారు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి సూచించారు. దోమకొండ, భిక్కనూరు, మాచారెడ్డి మండలం గజ్యానాయక్ తండాలోని రైతు వేదికలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. కామారెడ్డి నియోజకవర్గ పరిధిలో 304 మంది లబ్ధిదారులకు అందించినట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్లు, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆకతాయిలను నియంత్రించండి

రామారెడ్డి, న్యూస్‌టుడే: పాఠశాల మైదానంలో ఆకతాయిలు మద్యం తాగి సీసాలు పగులగొడుతున్నారని, అవి గుచ్చుకొని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆజాద్ హిందూ యువజన సంఘం సభ్యులు బుధవారం పోలీసులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో స్వామి, ప్రవీణ్, సాందీప్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని బల్దియా ఛైర్మన్ జంగం గంగాధర్ పేర్కొన్నారు. పట్టణంలోని మినీ స్టేడియంలో జోనల్ స్థాయి అండర్ 14, 17 ఖోఖో పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని, అభినందించారు. త్వరలో మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎజాజ్, ఖాలేక్, బాబా, నర్సుగొండ, హకీం, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రేమ్, తారాచంద్, అనిల్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ జంగం గంగాధర్

కఠిన చర్యలు తీసుకోవాలి

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే : కామారెడ్డి జీవదాన్ స్కూల్‌లో బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్‌కు ఎంఐఎం, ఎంఎస్‌పీ పార్టీల నాయకులు వినతి పత్రం ఇచ్చారు. పద్మారావు, అబ్దుల్‌రజాక్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

లింగంపేట,న్యూస్‌టుడే: మండలంలోని మాలోత్‌తండాలో రాజాగౌడ్ ఆధ్వర్యంలో భారతీయ కిసాన్ సంఘ్ కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాలోత్ మోహన్, ఉపాధ్యక్షులుగా మోహన్, గణేష్, కార్యదర్శిగా సర్దార్, సక్రు నియమితులయ్యారు.

పోషణ అభియాన్‌పై అవగాహన

గాంధారి, న్యూస్‌టుడే: పోషణ అభియాన్‌లో భాగంగా మండల కేంద్రంలోని నరేందర్ కాలనీ అంగన్‌వాడీ పాఠశాలలో బుధవారం పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఆరోగ్య విస్తీర్ణ అధికారి రవీందర్, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

లింగంపేట, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో బలవంతంగా పదవీ విరమణ పొందిన వీఆర్ఏ కుటుంబాల వారసులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ బుధవారం పలువురు వీఆర్ఏలు డీటీ సంగయ్యకు వినతిపత్రం అందించారు. గంట విజయ్, బాలరాజు, సంగయ్య, సాయిలు, దుర్గయ్య, భూషయ్య పాల్గొన్నారు

నిధులు కేటాయించాలని వినతి

తాడ్వాయి, న్యూస్‌టుడే: తాడ్వాయి మండల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, ఎర్రపహాడ్ ఆరోగ్య కేంద్రాన్ని విస్తరించాలని వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ , ఎంపీ సురేష్ షెట్కార్‌లను మండల నాయకులు కోరారు. బుధవారం వారు హైదరాబాద్‌లో నేతలను కలిసి వినతిపత్రాలు అందజేశారు. అనంతరం వారిని సన్మానించారు. నాయకులు షౌకత్ అలీ, వెంకట్రామ్‌రెడ్డి, మామిండ్ల రమేష్, విఠల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహాతో తాడ్వాయి నాయకులు

నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని పీజేఆర్ స్ఫూర్తి డిగ్రీ కళాశాల ఛైర్మన్ గురువేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కళాశాలలో బుధవారం టాస్క్ అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. శిక్షకురాలు హిమబిందు ప్రసంగిస్తూ.. తెలంగాణ సర్కారు నెలకొల్పిన టాస్క్ యువతకు ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. ప్రిన్సిపల్ విజయ్‌కుమార్‌గౌడ్, వైస్ ప్రిన్సిపల్ కృష్ణప్రసాద్ తదితరులున్నారు



జిల్లా కేంద్రంలో మాట్లాడుతున్న గురువేందర్‌రెడ్డి

వసతులు కల్పించండి

బీర్కూర్, న్యూస్‌టుడే: త్వరలో ధాన్యం కొనుగోలు దృష్ట్యా బీర్కూర్ మార్కెట్ కమిటీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భాజపా మండల నాయకుడు బీరుగొండ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఫాతిమాకు బుధవారం వినతిపత్రం అందజేశారు. మార్కెట్ యార్డులో పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు తొలగించాలని, ఆరబోసిన ధాన్యం చోరీ కాకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు.



చెక్కులు అందిస్తున్న నాయకులు

వస్త్ర దుకాణం ప్రారంభం



కామారెడ్డి ఎమ్మెల్యేకి పుష్పగుచ్ఛం ఇస్తున్న నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని స్టేషన్‌రోడ్డులో కిసాన్ మెన్స్‌వేర్ వస్త్ర దుకాణాన్ని నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దుకాణాన్ని సందర్శించిన కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని ఆయన సన్మానించారు. కార్యక్రమంలో ధన్‌పాల్ కుటుంబీకులు ఉదయ్‌కుమార్, ప్రణయ్‌కుమార్, రాఘవేంద్ర తదితరులున్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం సంఘం అధ్యక్షుడు కౌసర్, కార్యదర్శి శంకర్‌ల ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 27న నిజామాబాద్‌లో జరిగే ధర్నాకు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో నారాయణ, ఏశయ్య, ఫరీద్, మహ్మద్, నాగ్‌నాథ్, పండరి, సిరాజ్ తదితరులు ఉన్నారు.



సమావేశమైన ఆర్టీసీ విశ్రాంత సంఘం నాయకులు

బాధితులకు చేయూత

నాగిరెడ్డిపేట్,న్యూస్‌టుడే: నాగిరెడ్డిపేట మండలంలోని ఐదు గ్రామాల ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ. 1.61లక్షల చెక్కులను మండల కాంగ్రెస్ నాయకులు బుధవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. శ్రీనివాస్‌రెడ్డి, కిష్టయ్య, లక్ష్మణ్‌రాగూరు తదితరులు ఉన్నారు.

నేడు మహాజన సభ

బిచ్కుంద గ్రామీణం: బిచ్కుంద మండలంలోని పుల్కల్ సొసైటీలో గురువారం మహా జన సభను నిర్వహిస్తున్నట్లు సీఈవో సాయి ప్రకాష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రైతులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని ఆయన తెలిపారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో పేదలకు బుధవారం అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు చీల ప్రభాకర్ జ్ఞాపకార్థం కార్యక్రమం జరిగింది. ఆలయ ప్రధాన కార్యదర్శి గోనె శ్రీను, ఉపాధ్యక్షుడు పంపరి లక్ష్మణ్, ప్రతినిధులు వేణు, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: దాతల చేయూతతో అన్నదాన కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతుందని అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు విఠల్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఆలయంలో బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.



జిల్లా కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో ..

రికార్డుల తనిఖీకి అనుమతి

జుక్కల్: పంచాయతీకి సంబంధించిన 2013 నుంచి ఇప్పటి వరకు ఉన్న రికార్డులను తనిఖీ చేసేందుకు, ఫొటోలు, వీడియోలు తీసుకొనేందుకు అనుమతి ఇచ్చారని కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సెంట్రల్ కమిటీ సభ్యుడు శివచంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న నాగల్‌గావ్ పంచాయతీ రికార్డులను ప్రభుత్వ అధికారుల సమక్షంలో తనిఖీలు చేస్తామన్నారు. సహచట్టం ద్వారా దరఖాస్తు చేసుకోగా అనుమతి లభించిందన్నారు. వెంట సీసీఆర్ నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జాదవ్ వసంత్ ఉన్నారు.

సీఐకి సత్కారం

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ సీఐగా బాధ్యతలు స్వీకరించిన అశోక్‌ను బుధవారం పురఛైర్మన్ జంగం గంగాధర్, పాలకవర్గం సభ్యులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఏఎస్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు సీఐని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఎజాజ్, బాబా, కిరణ్, హకీం, నర్సుగొండ, ఫౌండేషన్ సభ్యులు సంతోష్, సాయికుమార్, పాల్గొన్నారు.

ఎండాకు తెగుళ్లతో పంటకు నష్టం

బిచ్కుంద గ్రామీణం, న్యూస్‌టుడే: వరి పంటకు ఎండాకు తెగులు ఆశించి ఆకులు ఎండిపోవడంతో అన్నదాతలు దిగులు చెందుతున్నారు. సన్న రకం వరిలో ఎక్కువగా ఇది వ్యాపిస్తోంది. మండల వ్యాప్తంగా పుల్కల్, వాజిద్‌నగర్, శెట్లూర్, ఖత్‌గామ్, మెక్క, బండారెంజల్‌లో వరి సాగు అధికంగా ఉంది. ఎండాకు తెగులు, సుడిదోమ, ఇతర తెగుళ్ల ఆశించి నష్టం చేస్తున్నాయి. ఏవో రాజలింగంను చరవాణిలో వివరణ కోరగా ...ప్లాంటామైసిన్ 60 గ్రాములు, కాపర్‌ఆక్సిక్లోరైడ్ ఎకరానికి 500 గ్రాముల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.



పుల్కల్ : తెగుళ్ల బారిన పడిన వరి పంట

తాగడానికి డబ్బులు ఇవ్వలేదని ఆత్మహత్య

నిజాంసాగర్, న్యూస్‌టుడే: మద్యం తాగడానికి ఇంట్లో డబ్బులు ఇవ్వలేదని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నిజాంసాగర్ మండలంలోని ఆరేడు గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్సై సుధాకర్ కథనం ప్రకారం..గ్రామానికి చెందిన పల్లి అశోక్(35) మద్యానికి బానిసయ్యాడు. ప్రతిరోజు మాదిరిగానే బుధవారం మద్యం తాగాడు. మళ్లీ తాగడానికి డబ్బులు కావాలని అడగడంతో కుటుంబసభ్యులు నిరాకరించారు. దీంతో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. శవపరీక్ష నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.



పల్లి అశోక్

యువకుడి బలవన్మరణం

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: భార్య పుట్టింటికి వెళ్లిందని చిట్టాపురం ప్రశాంత్(33) అనే యువకుడు బలవన్మరణం చెందిన ఘటన కామారెడ్డి మండలం గూడెం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ప్రశాంత్ ఇటీవల తన భార్యతో గొడవ పడడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన ఆయన తన పంట పొలంలో చెట్టుకు ఉరేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయమై దేవునిపల్లి ఎస్సై మధుసూదన్‌రెడ్డిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. తమకు ఫిర్యాదు అందలేదన్నారు.

దొంగల వేటలో పోలీసులు..!

సదాశివనగర్, న్యూస్‌టుడే : సదాశివనగర్ ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 13న జరిగిన కంప్యూటర్లు, బ్యాటరీల చోరీ కేసులో ఒక్కొక్కటిగా విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. చోరీ ఆనవాళ్లు ఎక్కడా కనిపించకపోవడంతో ఇది సిబ్బంది పనేనని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. 13న చోరీ జరిగితే ఈ నెల 21వరకు ఠాణాలో ఎందుకు ఫిర్యాదు చేయలేదనే విషయాలపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. తాజాగా కంప్యూటర్‌కు సంబంధించిన మానిటర్‌ను ఎంపీడీవో కార్యాలయం వెనుక ఉన్న మెట్లపై దుండగులు వదిలివెళ్లారు. దీనిపై ఉన్న వేలిముద్రలను పోలీసులు పరిశీలించారు. ఎవరో చేసిన తప్పిదాలకు మమ్మల్ని బలి చేస్తున్నారని మరి కొంతమంది ఉద్యోగులు వాపోతున్నారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ఎస్సై రంజిత్ తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఒకరి మృతి

బీబీపేట, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడి బీబీపేట గ్రామానికి చెందిన పెద్దరాములు(34) అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. పెద్దరాములు మంగళవారం రాత్రి తన అత్తగారింటికి వెళ్తుండగా జనగామ మర్రి సమీపంలో ప్రమాదం చోటుచేసుకుందన్నారు. బుధవారం మృతుడి భార్య రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

చెరువులో పడి ..

బిచ్కుంద: బిచ్కుందకు చెందిన హన్మండ్లు(38) రెండు రోజుల కిందట కాలకృత్యాలు తీర్చుకొనేందుకు వెళ్లి అందులో పడి మరణించినట్లు ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రాగి తీగల అపహరణ

పిట్లం, న్యూస్‌టుడే: కొన్నాళ్లు స్తబ్దుగా ఉన్న నియంత్రిక దొంగలు మళ్లీ రెచ్చిపోతున్నారు. బుధవారం రాత్రి చిన్న కొడప్‌గల్ శివారులో రైతుల పొలాల్లోని విద్యుత్తు నియంత్రికను ధ్వంసం చేసినట్లు ఏఈ బుజ్జిబాబు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. నియంత్రిక పగులగొట్టి అందులోని విలువైన రాగి తీగలను ఎత్తుకెళ్లినట్లు చెప్పారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని, శివారు ప్రాంతాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే నిఘా పెట్టి తమ దృష్టికి, పోలీసుల దృష్టికి తీసుకు రావాలని సూచించారు.



చెల్లాచెదురుగా పడి ఉన్న విద్యుత్తు నియంత్రిక